క్లుప్తంగా

అవగాహన కల్పించి ప్రజారోగ్యాన్ని కాపాడదాం

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య

నల్లజర్ల: ప్రజారోగ్యాన్ని కాపాడే ప్రధాన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖదే అని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టరు సంధ్య అన్నారు. మండలంలోని ముసుళ్లగుంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధ పడకూడదని, అలాంటి వారికి ఆరోగ్య అవగాహన కల్పిస్తూ వైద్యం అందించే బాధ్యత తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ప్రజలతో మమేకమై ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొంటూ అందరికీ ఆరోగ్యాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి గంగాధరరావు, సీహెచ్ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలకు అంతరాయం

నల్లజర్ల: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మండలంలోని పోతవరం సబ్ స్టేషన్ పరిధిలోను, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకూ అనంతపల్లి సబ్ స్టేషన్ పరిధిలోను విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తామని నిడదవోలు ఏపీఈపీడీఎల్ ఈఈ బి.వీరభద్రరావు మంగళవారం తెలిపారు.

నేడు ఉండ్రాజవరం మండల సమావేశం

ఉండ్రాజవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు నిడదవోలు మున్సిపల్ సమావేశం

నిడదవోలు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఇన్‌చార్జి కమిషనర్ ఎ.మాధవి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

ఆర్టీసీ కార్మికులకు వైద్య పరీక్షలు

కొవ్వూరు: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీలో డెల్టా ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళ వారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. డ్రైవర్‌లు, కండక్టర్‌లు, ఇతర సిబ్బందికి వైద్యులు ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

నిడదవోలు: విశాఖ జిల్లా డీపీటీవో నియంతృత్వ ధోరణి, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు బుధవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు బొబ్బిలి రాము మాట్లాడుతూ విశాఖ డీపీటీవో మొండి వైఖరి కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేపట్టామన్నారు. ఇటువంటి అధికారుల కార్మిక వ్యతిరేక విధానాలతో ఆర్టీసీకి, అటు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డిపో సహాయ కార్యదర్శి హనుమంతరావు, ఎస్ సురేష్, కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొవ్వూరు: పట్టణంలో గామన్ ఇండియా టోల్ ప్లాజా సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. మతి స్థిమితం లేకుండా ఈ వ్యక్తి స్థానికంగా సంచరిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పట్టణ పోలీసులు చెబుతున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు తెలిపారు.

నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటా

- కష్టించి పని చేసే ప్రతి కార్యకర్తకూ అండగా నిలుస్తా
- అందరినీ సమన్వయ పరచుకుంటూ పనిచేస్తా
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు
- మండలంలోని పలు గ్రామాల్లో పరిచయ భేటీలు



కొవ్వూరు మండలం మద్దూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు

కొవ్వూరు: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని సీతంపేట, మద్దూరులంక, మద్దూరు, ఐ.పంగిడి గ్రామాల్లో మంగళవారం ఆయన సందర్శించారు. పార్టీ నాయకులతో పరిచయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట్రావుకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శాలువాలతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఆయా గ్రామాల పార్టీ ముఖ్య నాయకులను వ్యక్తిగతంగా ఎమ్మెల్యే తలారి పరిచయం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీ శ్రేణులంతా రానున్న రోజుల్లో మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ప్రతి ఒక్క కార్యకర్త కష్టాన్ని తాను గుర్తించుకుంటానన్నారు. ఏ ఒక్కరికి కష్టం వచ్చినా అండగా నిలుస్తానని వెంకట్రావు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతి పక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నాయకులందరీ సమన్వయ పరచుకుంటూ కొవ్వూరు నియోజకవర్గంలో ఐకమత్యంగా పార్టీని నడిపించేందుకు కృషి చేస్తానన్నారు.

త్వరలో కొవ్వూరులో క్యాంప్ కార్యాలయం

కొవ్వూరు పట్టణంలోని మెరక వీధిలో త్వరలోనే తన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వెంకట్రావు ప్రకటించారు. ఇందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు కాకర్ల సత్యనారాయణ, జొన్నకూటి పోసిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, ఎంపీటీసీ సభ్యులు దేవన అనంతలక్ష్మి, బొలిశెట్టి దుర్గారావు, దేవన సత్యనారాయణ, మద్దూరులంక సర్పంచ్ బొలిశెట్టి రత్నకుమారి, మాజీ సర్పంచ్ కంచుమర్తి వెంకట్రావు, మద్దూరు సొసైటీ అధ్యక్షుడు తోట నారాయణ, నాయకులు సంగీతం చిన వెంకటేశ్వర్లు, పుసులూరి రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు, శ్రీరంగం బుజ్జిబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, కామన రత్నాజీ, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, ముదునూరి నాగరాజు, వరిగేటి సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీసుల దృష్టి



వాదాలకుంట జెడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

గోపాలపురం: ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో గోపాలపురం, దేవరపల్లి మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్టు దేవరపల్లి సీఐ కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని వాదాలకుంట జెడ్పీ హైస్కూల్ పోలింగ్ బూత్- 27ను పరిశీలించారు. సమస్యాత్మక అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఇప్పటి నుంచే దృష్టి సారించినట్టు సీఐ తెలిపారు. గత ఎన్నికలకు ముందు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైన వారి వివరాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. సీఐ వెంట గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్, బూత్ లెవెల్ అధికారులు ఉన్నారు.

విద్యారంగంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- 280 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



తాడిమళ్లలో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, అధికారులు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి భావి పౌరుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. కంసాలిపాలెం, తాడిమళ్ల, కోరుమామిడి, కాట కోటేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని మొత్తం 280 మంది 8వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 1824 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశామన్నారు. అంతేగాకుండా నియోజకవర్గంలో రూ.272.76 కోట్ల వ్యయంతో అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, గోరుముద్ద, నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. కాగా మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా తొలుత అక్కడి బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, సర్పంచులు బయ్యే రాధారాణి, కొండపల్లి శ్రీనివాస్, అంబటి గోపమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల నాగేశ్వర రావు, వరిగేటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకులు మానుకొండ చంద్రబాబు, టి.దుర్గారావు, ఎంఈఓలు కేవీ గణేష్, పి.గురుమూర్తి, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దూబచర్ల-ద్వారకా తిరుమల రోడ్డుకు శంకుస్థాపన



దూబచర్ల-ద్వారకా తిరుమల రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: దూబచర్ల-ద్వారకా తిరుమల రహదారికి హోం మంత్రి తానేటి వనిత మంగళవారం సాయంత్రం దూబచర్లలో శంకుస్థాపన చేశారు. రూ.6.5 కోట్ల వ్యయంతో తొమ్మిది కిలోమీటర్ల పొడవునా ఈ రోడ్డును ఆధునీకరించనున్నట్టు మంత్రి తెలిపారు. పనులు నాణ్యంగా, త్వరతగతిన చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సాధారణ ప్రజల కంటే కూడా ఈ రహదారి శని, ఆదివారాలు ద్వారకా తిరుమలకు నడిచి వెళ్లే భక్తులకు చాలా ఉపయోగకరమన్నారు. ఎన్నికలు సమీపించిన వేళ కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడెక్కడ రహదారుల ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి అక్కడ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడం చాలా సంతోషకరమన్నారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ రహదారి పనులకు నిధులు కేటాయించినందుకు నియోజకవర్గ ప్రజల తరఫున ఆమె ధన్యవాదాలు తెలిపారు. కాసాని బాటయ్య నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి పూజలు చేశారు. కొత్తగూడెం గ్రామంలో వైఎస్సార్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దూబచర్ల సర్పంచ్ తాడిగడప బాలయ్య, ద్వారకాతిరుమల ఎంపీపీ మోహిని, రాజబాబు, వైస్ ఎంపీపీ శివాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్, నాయకులు తొమ్మండ్రు రమేష్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేదల చెంతకే కార్పొరేట్ స్థాయి వైద్యం

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- పెద్దేవం జగనన్న సురక్ష శిబిరంలో 459 మందికి వైద్యం



పెద్దేవంలో వైద్య శిబిరంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల వద్దకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తెచ్చిందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు పి.అన్నపూర్ణ, సుచందన, కె.భాగ్యలక్ష్మి, సాయికుమార్‌లు 459 మంది రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. రూ.25 లక్షలకు పెంచిన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, ఆ పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, పెద్దేవం పంచాయతీ సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పార్టీ నాయకులు కొలిశెట్టి నాగేశ్వరరావు, గండి రాంబాబు, పిట్టా శ్రీనివాస్, అందుగుల రవి, మైలవరపు రాధాకృష్ణ, ఎంపీడీవో వెంకటరమణ, పాఠశాల హెచ్ఎం సీహెచ్ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పరామర్శ

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ తాళ్లపూడి మండల శాఖ అధ్యక్షుడు సిర్రా గంగారావు భార్య దీప్తి అనారోగ్యంతో రాజమహేంద్రవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకటరావు మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి వెళ్లి దీప్తిని పలకరించారు. ఆమె ఆరోగ్యం వివరాలు, వైద్య సేవల గురించి ఆరా తీశారు. మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఉప్పులూరి సూరిబాబు తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి అడ్డు వస్తే సహించేది లేదు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ఖండవల్లిలో గడప గడపకూ..



ఖండవల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: పల్లెల అభివృద్ధికి ఏ పార్టీ వారైనా అడ్డంకిగా మారితే సహించేది లేదని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు హెచ్చరించారు. మండలంలోని ఖండవల్లి గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని 240 గృహాలను సందర్శించారు. ప్రతి ఇంటి వారినీ ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు అడిగి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొందరు తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ, గ్రామంలో భూమి సేకరించిన మేర లబ్ధిదారులకు స్థలాలు కేటాయించామన్నారు. ఈ గ్రామంలోని టీడీపీ, జనసేన నాయకులు ఒక్కటై పిటిషన్లు పెడుతూ, అడ్డంకులు సృష్టిస్తూ స్థల సేకరణకు అడ్డంకిగా మారుతున్నారన్నారు. అందుకే కొందరికి స్థలాల సేకరణలో ఆలస్యం అయ్యిందని వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, పల్లేటి రవి, సొసైటీ అధ్యక్షుడు కుసుమే సూరిబాబు వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కంద వెంకన్న, నాయకులు చిన్నబాబు, నాగు వివిధ పంచాతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తనయుడి ఎన్నికల ప్రచారం

నిడదవోలు రూరల్: ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడి తనయుడు వరుణ్ సాయి మంగళవారం మండలంలోని కోరుమామిడి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసి అన్ని వర్గాలకు మేలు చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అబంటి గోపమ్మ, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, ఎంపీటీసీ సభ్యురాలు వరిగేటి సౌజన్య, సొసైటీ అధ్యక్షుడు వింతా గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానుబోయిన శేషు, మానుకొండ చంద్రబాబు, పెద్దిరాజు, రాపాక వెంకట్రావు, గృహసారథులు పాల్గొన్నారు.

అమ్మో.. 'పులి'

- కొత్తగూడెంలో దూడను చంపి తినేసిన వైనం



పులి గాండ్రింపుతో భయపడి చెట్టెక్కిన కొత్తగూడెం రైతు ముక్కవల్లి బాలసుందరం

ద్వారకాతిరుమల: కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్ద పులి మంగళవారం తెల్లవారుజామున మండలంలోని రామసింగవరం పంచాయతీ, కొత్తగూడెంలో ఒక దూడను చంపి తినేసింది. ఈ గ్రామానికి చెందిన రైతు ముక్కవల్లి బాలసుందరం పాలు పితికేందుకు తెల్లవారుజామున తన తోటలోకి వెళ్లాడు. అప్పటికే అక్కడ కట్టేసి ఉన్న గేదెలు, దూడలు బెదిరిపోయి అరుస్తుండడాన్ని గమనించాడు. ఒక గేదె దూడ లేకపోవడాన్ని గుర్తించాడు. దూడ కోసం వెదుకుతుండగా సమీప పొదల్లోంచి పులి గాండ్రింపులు వినబడడంతో తీవ్ర భయాందోళనకు గురైన బాల సుందరం వెంటనే అక్కడున్న జీడి మామిడి చెట్టెక్కి కూర్చున్నాడు. తన వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా స్థానిక రైతులకు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. ఆ నోట, ఈనోటా చుట్టుపక్కల గ్రామాలకు సైతం ఈ వార్త వ్యాపించడంతో పెద్ద ఎత్తున ప్రజలు పులి.. పులి అంటూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న తూర్పు గోదావరి జిల్లా డీఎఫ్‌వో నాగరాజు, జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో ఎ.వెంకట సుబ్బయ్య, ఏలూరు సబ్ డీఎఫ్‌వో ఆర్.శ్రీదేవి, ఏలూరు ఎఫ్ఆర్‌వో ఎస్‌వీకే కుమార్, నూజివీడు ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సిఫార్సులతో పనిలేదు.. అవినీతికి తావులేదు

- జగనన్న పాలనలోనే ఇది సాధ్యం
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- వైఎస్సార్ సీపీ మండల శ్రేణులతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: సిఫార్సులతో పని లేకుండా, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకూ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల మండల స్థాయి ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి వనిత తన పరిచయ కార్యక్రమంతో పాటు, వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ తాను రాష్ట్రానికి హోం మంత్రిని అయినప్పటికీ ఈ నియోజకవర్గానికి మాత్రం ఆడపడుచునే అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్తా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తానన్నారు. ఏ పనికైనా నేరుగా తనను కలవొచ్చన్నారు. మధ్యవర్తుల ప్రమేయం ఉండదన్నారు. అందరం కలసికట్టుగా ప్రయాణం చేద్దామన్నారు. వచ్చే నెల 3న దెందులూరులో జరిగే సిద్ధం మహాసభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చేందుకు సిద్ధం కావాలని సూచించారు.

అధికారులతో సమీక్ష

అనంతరం మంత్రి వనిత మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ పి.సతీష్‌తో మాట్లాడి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు, అలాగే డి పట్టాలు ఎంత మందికి ఇవ్వాలని ఆరా తీశారు. కోర్టు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. హౌసింగ్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏ మేరకు పనులు జరిగాయి? కుళాయి కనెక్షన్లు ఎన్ని ఉచితంగా ఇచ్చారు అన్నదానిపై అధికారులను ఆరా తీశారు. జలకళ పథకంలో బోర్లు సొంతంగా వేసుకున్న రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, వైస్ ఎంపీపీలు యలమర్తి దుర్గాదేవి, ఓగిరాల చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, మల్లెపూడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, BATTU NARENDRA KUMAR S/o Lakshmi residing at D.No.: 1-12, 10th ward, Kotha peta Vemuluru, Kovvuru Mandal, East Godavari Dist. A.P., India now changed my name from PUCCHAKAYALA NARENDRA KUMAR (OLD NAME) To BATTU NARENDRA KUMAR (NEW NAME)


CHANGE OF NAME

I,BATTU LAKSHMI W/O RAJU residing at D.No.: 1-12. 10th Ward Kotha peta Vemuluru, Kovvuru Mandal East Godavari Dist. A.P., India now changed my name from PUCCHAKAYALA MARIYA-KUMARI (OLD NAME) TO BATTU LAKSHMI (New name)



మతిమరుపుతోనే అసత్య ఆరోపణలు

- అవినీతి కేసులో రిమాండ్ ఖైదీ చంద్రబాబు
- నిజాయితీపరుడైన నాపై విమర్శలు చేసేది ఆయనా ?
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: వయసు మీద పడిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మతిమరుపుతో తనపై అసత్య ఆరోపణలు చేశారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు ధ్వజమెత్తారు. సోమవారం నాటి కాతేరు 'రా కదలిరా' బహిరంగ సభలో చంద్రబాబు తనపై చేసిన విమర్శలపై ఆయన మండిపడ్డారు. పట్టణంలో తన క్యాంపు ఆఫీసులో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతి స్థిమితం కోల్పోయిన చంద్రబాబుకు నియోజకవర్గాలు, ఎమ్మెల్యేల పేర్లు గుర్తుకు రాని దుస్థితిలో ఉన్నారని శ్రీనివాస్‌నాయుడు అన్నారు. క్రింది స్థాయి నాయకులు రాసిచ్చిన స్క్రిప్టును చదువుతూ చంద్రబాబు తనపై లేనిపోని ఆరోపణలు చేశారని తప్పుపట్టారు. తన తండ్రి జీఎస్ రావు వారసుడిగా ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాలు చేస్తున్నామన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో అవినీతి మరక లేకుండా ప్రజలకు సేవ చేసే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది శ్రీనివాస్‌నాయుడు మాత్రమే అని చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారన్నారు. ఇసుక, మట్టి వ్యాపారాల్లో నాకు తనకు ప్రమేయం ఉన్నట్లు చంద్రబాబు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. అవి నూరు శాతం అసత్య ఆరోపణలంటూ ఖండించారు.

దోచుకున్నది టీడీపీ వారే..

గత టీడీపీ ప్రభుత్వంలో నిడదవోలు నియోజకవర్గాన్ని ఇసుక, మట్టి మాఫియాలు ఏ విధంగా దోచుకున్నారో, లంచాలు, కమిషన్‌లు తీసుకున్నారో ప్రజలందరికీ తెలుసని శ్రీనివాస్‌నాయుడు గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో తమ పార్టీ నాయకుల నిర్వాకంపై స్వయంగా చంద్రబాబే విజిలెన్స్ దాడులు చేయించిన విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో, తాను ఎమ్మెల్యేగా గత ఐదేళ్లలో ఎలాంటి మాఫియాకు అవకాశం ఇవ్వలేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో నిందితుడిగా ఇటీవలే రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండి బయటకు వచ్చిన చంద్రబాబు ఇతరులపై నిందలు వేయకుండా తాను ఏం తప్పు చేశానో ఆలోచించుకోవాలని హితవు పలికారు.

మునిపల్లిలో చోరీ

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లి గ్రామంలోని వెలగన రాంబాబు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. దీనిపై సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన బంధువు ఒకరు మృతి చెందడంతో గత నెల 29న వెలగన రాంబాబు తన భార్య దుర్గాభవానితో కలసి ఉండ్రాజవరం మండలం, మోర్త గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. వారిద్దరూ మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చే చూసేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న అరకాసు చెవి దిద్దులు, ఐదు తులాల కుంకుమ భరిణె, రూ.24 వేల నగదు అపహరించినట్టు వారు గుర్తించారు. దీనిపై రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

జాతిపిత బాపూజీకి ఘనంగా నివాళి

చాగల్లు: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం మల్లవరం గ్రామంలోని ఆనంద నికేతన్ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఆశ్రమం నిర్వాహకులు, గాంధేయవాదులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కళాప్రపూర్ణ చర్ల గణపతి శాస్త్రి, సుశీల సాహిత్య పురస్కారాన్ని తెలుగు అధ్యాపకులు డాక్టర్ తాడేపల్లి వరలక్ష్మి, చిట్టా రామయ్యశర్మ దంపతులకు కస్తూరీ బాయి వృద్ధాశ్రమం నిర్వాహకులు డాక్టర్ చర్ల మృదులకుమారి ప్రదానం చేశారు. ఏటా ఇచ్చే ఈ పురస్కారానికి తనను ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ వరలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, లకంసాని సత్యనారాయణమూర్తి, కరుటూరి జగన్, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P. No. 04/2024

పిటీషన్:
గుడాల గౌతమి, తండ్రి: బుల్లి వెంకయ్య, స్త్రీ, వయస్సు: 37 సం॥, డి.నెం.1-177, [illegible] గ్రామం, చాగల్లు మండలం, తూర్పుగోదావరి జిల్లా - పిటీషనర్

మరియు

R1) కొండేటి మహేష్ బాబు, తండ్రి: పల్లారావు, పురుషుడు, వయస్సు: 27. సం, డి.నెం. 8-50, చిక్కాల గ్రామం, చాగల్లు మండలం, తూ.గో. జిల్లా.
R2) గన్నమని శ్రీరామ్, తండ్రి: గంగాధర రావు, పురుషుడు, వయస్సు 24. సం, డి.నెం:-4-60, [illegible] గ్రామం, దేవరపల్లి మండలం, తూ.గో. జిల్లా.
R3) The Official Receiver, Eluru District, West Godavari District, Eluru. - 1,2,3 రెస్పాండెంట్లు.

వాయిదా : 12-02-2024.

పై నెంబరు IP లో పిటిషనరుకు 1వ రెస్పాండెంటు 2వ రెస్పాండెంటుకు [illegible] ప్రామిసరీ నోటు [illegible] 2వ రెస్పాండెంటు పేర లాలూచీ దస్తావేజు ది.03-10-2023 వ తేదీన వ్రాసినారు. సదరు ది. 03-10-2023వ తేదీన 1వ రెస్పాండెంటు 2వ రెస్పాండెంటు పేరున వ్రాసి యిచ్చిన క్రయ దస్తావేజును రద్దు చేయించుటకు 1వ రెస్పాండెంటుని INSOLVENT గా డిక్లేర్ చేయించవలెనని కోరుతూ IP 04/2024 దాఖలు చేయడమైనది. IP 04/2024 ది. 12-02-2014 తేదీకి వాయిదా ఉన్నందున రెస్పాండెంట్లు 1 to 3 లోపున ఉదయం గం. 10:30 నిలకు [illegible] పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీరు గల ఆక్షేపణలు తెలియచేయగలరు. అట్లుకాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

Bonta Divya Dimple
B.A., LL.B. (Hons), Advocate,
Kovvur.Cell: 8985984919.
కొవ్వూరు
29-01-2024.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com